సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 9 । జూలై । 2025



జననేతకు ఘన నివాళి

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘన నివాళులర్పించారు. 9లో



బెంగాలీ కూలీ.. మాకూ కావాలి

పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు క్రమ పద్ధతిలో వరి నాట్లు వేస్తుండగా, జిల్లా రైతులు వారిని ఆదరిస్తున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31°/ 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో రేపు చండీహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 6303408458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఈఓపై దాడిని ఖండించిన మంత్రి తుమ్మల

భద్రాచలంటౌన్ : భద్రాచలం రామాలయ ఈఓ రమాదేవిపై ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన భూ ఆక్రమణదారులు దాడి చేయడాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖండించారు. ఈఓను ఫోన్‌లో పరామర్శించిన ఆయన.. ఈ ఘటన దురదృష్టకరమని అన్నారు. దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను ఆదేశించారు. ఆలయ భూముల విషయంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించి దేవాలయానికి చెందేలా చర్యలు తీసుకుంటారని, ఆ భూములు దక్కితేనే ఆలయ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కాగా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్ కూడా ఈఓకు ఫోన్ చేయగా, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నేరుగా పరామర్శించారు.

ఆలయ ఉద్యోగుల ఖండన..

ఈఓ రమాదేవిపై జరిగిన దాడిని యాదగిరిగుట్ట, వేములవాడ ఆలయాల ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులు, తీవ్ర పదజాలంతో దూషించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విధులకు హాజరు కండి

సింగరేణి కార్మికులకు డైరెక్టర్(పా) పిలుపు



మాట్లాడుతున్న గౌతమ్ పొట్రు

సింగరేణి(కొత్తగూడెం): సమ్మెలో పాల్గొనకుండా విధులకు హాజరై బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు, డైరెక్టర్(పీఅండ్‌పీ) కె.వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలెంరాజు కార్మికులను కోరారు. బుధవారం దేశవ్యాప్త సమ్మెకు పలు సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. తమ కార్యాలయాల్లో మంగళవారం వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాలు చేస్తున్న డిమాండ్లలో ఒక్కటి కూడా సింగరేణికి సంబంధించినది లేదని తెలిపారు. ఇప్పటికే వివిధ కారణాలతో బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపులో కొంత వెనకబడి ఉన్నామని, ప్రస్తుతం వర్షాకాలం అయినందున జూలై, ఆగస్టు నెలల్లో ఉత్పత్తికి మరింతగా అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఈ విషయాలను కార్మికులు గమనించి సమ్మెకు దిగకుండా విధులకు హాజరు కావాలని కోరారు.

బాధితుల సమస్యలు పరిష్కరించాలి



పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించాక మాట్లాడుతూ.. వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చేలా బాధ్యతగా మెలగాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 100కు ఫోన్ రాగానే ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని అన్నారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎస్పీతో పాటు అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. తొలుత డీఎస్పీ రెహమాన్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, ఎస్సైలు పురుషోత్తం, విజయకుమారి పాల్గొన్నారు.

ఎన్జీటీ ఆదేశాలతో ఆగిపోయిన సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మాణ పనులు (ఫైల్)



ఫైన్ కడితే.. లైన్ క్లియర్

2022లో సీతమ్మ సాగర్ నిర్మాణ పనులు ప్రారంభం

- అనుమతి లేకుండా పనులేంటని ఎన్జీటీ ఆగ్రహం
- తక్షణమే నిలిపేయడంతో పాటు రూ.53.41 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశం
- జరిమానా చెల్లింపునకే ప్రభుత్వం మొగ్గు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగు భూములకు గోదావరి జలాలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు చేపట్టింది. ఈ క్రమంలో సీతమ్మ సాగర్ పేరుతో గోదావరిపై బరాజ్ నిర్మిస్తోంది. పర్యావరణ అనుమతుల కోసం 2018లో కేంద్ర పర్యావరణ శాఖకు దరఖాస్తు చేసింది. ఆ వెంటనే వివిధ ప్యాకేజీలుగా విభజించి ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ప్రారంభించింది. అయితే కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు రాకుండానే సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మిస్తున్నారని, గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా నదీ పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలు, పొలాలు, అడవులు మునిగిపోతాయని భద్రాచలం ఏజెన్సీకి చెందిన కొందరు 2022 డిసెంబర్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ), చెన్నై బెంచ్‌ను ఆశ్రయించారు. దీంతో పర్యావరణంతో పాటు అన్ని రకాల అనుమతులు వచ్చే వరకు ప్రాజెక్టు పనులు ఆపాలంటూ 2023 ఏప్రిల్ 26న ఎన్జీటీ ఆదేశాలు జారీ చేసింది.

డీపీఆర్‌కు లైన్ క్లియర్..

సీతమ్మసాగర్ బరాజ్ నిర్మాణంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేయగా, మరోవైపు ఈ బరాజ్ నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)కు కూడా అనుమతులు లేవు. దీంతో గత ఏడాది కాలంగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి సాంకేతిక అనుమతులు సాధించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. 2024 ఆగస్టు నుంచి ప్రయత్నించగా ఈ ఏడాది ఏప్రిల్ 24 నాటికి డీపీఆర్‌కు ఎకనామిక్ ఫీజుబులిటీ, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం లభించాయి. ఇక పర్యావరణ, అటవీశాఖ అనుమతులు కూడా సాధిస్తే సాంకేతిక చిక్కులన్నీ తొలగిపోయినట్టే. అయితే ఈ పర్మిషన్లు రావాలంటే ముందుగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన జరిమానా చెల్లించక తప్పని పరిస్థితి ఎదురైంది.

అప్పీల్‌పై యూటర్న్..

సీతారామకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ నుంచి ఆమోదం వచ్చిన తర్వాత రూ. 53.41 కోట్ల జరిమానాపై అప్పీల్‌కు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుగా భావించింది. అయితే అప్పీల్‌కు వెళ్లడం ద్వారా ఒనగూరే ప్రయోజనం కంటే విలువైన సమయం వృథా అవుతుందనే భావనతో ప్రభుత్వ పెద్దలు ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గినట్టు తెలుస్తోంది. దీంతో ఎన్జీటీ విధించిన జరిమానా చెల్లించడమే మంచిదనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. త్వరితగతిన ఎన్జీటీకి జరిమానా చెల్లించి ఆ వెంటనే ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్‌లు సాధించడంపై సర్కారు దృష్టి సారించాల్సి ఉంది. ఈ పనులన్నీ రాబోయే రెండు, మూడు నెలల్లో జరిగితేనే, ఈ ఏడాది చివరి నాటికి బరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవకాశం చిక్కుతుంది. లేదంటే మరో ఏడాది వృథా కానుంది. ఇప్పటికే బరాజ్ నిర్మాణ పనులు (జలవిద్యుత్ కేంద్రం మినహాయించి) దాదాపు 40 శాతం వరకు పూర్తయ్యాయి.

సర్కారుకు భారీ జరిమానా..

నిర్మాణ పనులు ఆపేయాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఉన్నప్పటికీ అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి, దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి గ్రామాల మధ్య బరాజ్ నిర్మాణ పనులు కొనసాగాయి. ఈ అంశం మరోసారి ఎన్జీటీ దృష్టికి రావడంతో ద్విసభ్య కమిషన్ వేసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎన్జీటీ ధర్మాసనం తెప్పించుకుంది. ఆ తర్వాత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు 2023 మే 29 నుంచి ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అంతేకాదు.. తమ ఆదేశాలు ధిక్కరించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్జీటీ రూ. 53.41 కోట్ల జరిమానా విధించింది.

మునగ తోట.. లాభాల బాట

- పత్తి, పామాయిల్ తోటల్లో అంతర పంటగా సాగు చేయండి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

టేకులపల్లి : మునగ తోటలు సాగు చేసి లాభాల బాట పట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైతులకు సూచించారు. మండలంలోని రాంపురం పంచాయతీ పాతతండాలో సాగు చేసిన మునగ తోటను మంగళవారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు గాంధీని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆసక్తి గల రైతులంతా మునగ సాగు చేయాలని సూచించారు. పత్తి, పామాయిల్ తోటల్లో అంతర పంటగా కూడా సాగు చేయొచ్చని చెప్పారు. మునగ కాయలు, ఆకులతో పాటు ఎండిన విత్తనాలతో కూడా అధిక ఆదాయం వస్తుందని వివరించారు. రైతులు బయోచార్ కోల్ తయారు చేసుకోవాలని, అందుబాటులో ఉన్న కలపను 'వి' ఆకారంలో తీసిన గొయ్యిలో వేసి కాల్చాలని, తద్వారా వచ్చిన బొగ్గును గో మూత్రంలో కలిపి ఎరువుగా వినియోగించాలని సూచించారు. ఇళ్లలో నీరు నిల్వ ఉన్న చోట ఇంకుడు గుంతలు నిర్మించేలా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ బి.మల్లేశ్వరి, ఎంపీఓ జక్కుల గణేష్ గాంధీ, ఏఓ అన్నపూర్ణ, ఏపీఓ శ్రీనివాస్, ఏపీఎం రవికుమార్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శి రాజశేఖర్, సీసీలు శ్రీలత, సునీల్, టీఏ సురేష్, ఎఫ్ఏ సాగర్, ఏఈఓ భాగ్యశ్రీ పాల్గొన్నారు.



టేకులపల్లి : పాతతండాలో మునగ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పిల్లల సంరక్షణ అందరి బాధ్యత..

సూపర్‌బజార్(కొత్తగూడెం): పిల్లల సంరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా బాలల సంరక్షణ యూనిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల కార్మిక రహిత జిల్లాగా మార్చేందుకు కోళ్లఫామ్‌లు, ఇటుక బట్టీలు, షాపింగ్ మాళ్ల వంటి చోట తనిఖీలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎన్ని పోక్సో కేసులు నమోదయ్యాయో నివేదిక అందజేయాలని ఆదేశించారు. చైల్డ్ హెల్ప్ లైన్ కు వచ్చే ఫిర్యాదులను నమోదు చేయాలన్నారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, సీపీఓ సంజీవరావు, డీడబ్ల్యూఓ లెనీనా, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఐటీ కోర్ సీఐ రాము పాల్గొన్నారు. కాగా, ఈనెల 9, 10 తేదీల్లో కలెక్టరేట్‌లో నిర్వహించే మెగా ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

'నవోదయానికి' తొలి అడుగు

అశ్వాపురం: మండలంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలన్న ఈ ప్రాంత ప్రజల కల నెరవేరనుంది. నవోదయ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. ఈ మేరకు మండల పరిధిలోని బీజీ కొత్తూరులో 30 ఎకరాల ప్రభుత్వ భూమి పత్రాలను తహసీల్దార్ మణిధర్ నవోదయ విద్యాలయ అధికారులకు మంగళవారం అప్పగించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు నవోదయ విద్యాలయం రాగా, బీజీ కొత్తూరులో ప్రభుత్వ భూమిని గుర్తించడంతో పాటు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇక్కడ తిరిగి నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తారా, ఇతర ప్రాంతాలకు తరలిస్తారా అని ప్రజల్లో సందేహాలు మొదలయ్యాయి. కాగా, ఎట్టకేలకు భూమి కేటాయింపుతో స్థానికుల కల సాకారం కానుంది.



నవోదయ అధికారులకు భూమి పత్రాలు అప్పగిస్తున్న తహసీల్దార్ మణిధర్

ఐదు గిరిజన కుటుంబాల వెలి..

- వారికి ఎవరూ సాయం చేయొద్దంటూ కట్టుబాటు
- జిల్లాలోని పాత పూసపల్లిలో అనాగరిక చర్య
- ఏడాదిగా ఇబ్బంది పడుతున్న బాధితులు

ఇల్లెందు : ప్రపంచం అన్ని రంగాల్లో పరుగులు తీస్తున్న ఈ కాలంలోనూ అనాగరికం రాజ్యమేలుతోందనడానికి ఈ ఘటన నిదర్శనం. భూపంచాయితీలో తమ మాట వినలేదంటూ ఐదు గిరిజన కుటుంబాలను వెలివేయడంతో పాటు వారికి ఎవరూ సాయం చేయొద్దంటూ నిబంధన విధించారు గ్రామ పెద్దలు. ఏడాది కాలంగా ఇబ్బంది పడుతున్న బాధితులు సీపీఎం నాయకుల సహకారంతో మంగళవారం తమ గోడును బాహ్య ప్రపంచం దృష్టికి తీసుకొచ్చారు. ఇల్లెందు మండలం పాతపూసపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు ముడిగె రాములు, ముడిగె సీతమ్మ, ముడిగె సుగుణ, ముడిగె లక్ష్మీనారాయణ, ముడిగె సత్యనారాయణకు అదే కులానికి చెందిన కుంజా రాంబాబు కుటుంబంతో భూ వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో గ్రామంలో పంచాయితీ పెట్టించగా స్థానిక పెద్దలు వర్సా అవినాష్, సూర్నబాక వెంకటనారాయణతో పాటు మరో 15 మంది కుల పెద్దలు రాంబాబు కుటుంబానికి అనుకూలంగా ఏకపక్ష తీర్పు చెప్పారని బాధితులు తెలిపారు. ఈ తీర్పును తాము వ్యతిరేకించడంతో ముడిగె కుటుంబాలకు చెందిన తమను గ్రామం, కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. దీంతో ఏడాది కాలంగా తమను గ్రామంలో ఏ పనికీ పిలవడం లేదని, నెల క్రితం తమ కుటుంబంలో ఓ మహిళ మృతి చెందితే కడసారి చూపునకు కూడా ఎవరూ రాలేదని వాపోయారు. దహన సంస్కారాల్లో సహకరించేందుకు పక్కనున్న మిట్టపల్లి గ్రామం నుంచి కొందరు వస్తే వారిపైనా ఆగ్రహం వ్యక్తం చేశారని, గ్రామంలో ఉపాధి హామీ పనులకు కూడా తమకు అవకాశం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ తమ ఐదు కుటుంబాలతో గ్రూప్ ఏర్పాటుచేసి పని కల్పించారని చెప్పారు. తమ కుటుంబంలోని ఓ చిన్నారిని పాఠశాలకు వెళ్లేందుకు ఆటో కూడా ఎక్కించుకోకుంటే తల్లిదండ్రులే ప్రతి రోజూ తీసుకెళ్తున్నారని, మహిళలకు డ్వాక్రా రుణాలు కూడా ఇవ్వడం లేదని వెల్లడించారు.



బహిష్కరణకు గురైన పాత పూసపల్లి గ్రామ ఆదివాసీలతో నాయకులు

బూర్జువా పాలన సాగుతోంది..

పాతపూసపల్లి గ్రామంలో బూర్జువా పాలన సాగుతోందని సీపీఎం, గిరిజన సంఘం నాయకులు వజ్జా సురేష్, కొడెం బోసు, మన్నెం మోహన్‌రావు అన్నారు. ఏడాది కాలంగా ఐదు కుటుంబాలను హింసించడం దుర్మార్గమని, ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. కాగా, ఈ విషయమై బాధితులు ఎస్సై హసీనాను కలవగా, ఆమె పిలిపించి మాట్లాడినా గ్రామ పెద్దలు వినలేదని సమాచారం.

ప్రశాంత వాతావరణం కల్పించాలి

- పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలగాలి
- డీఈఓ వెంకటేశ్వరా చారి



పాల్వంచ : మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరా చారి

పాల్వంచ: పిల్లలు చదువుకునేందుకు ఇళ్లలో ప్రశాంత వాతావరణం కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి తల్లిదండ్రులకు సూచించారు. అంతేకాక పిల్లలతో స్నేహ పూర్వకంగా మెలగాలని అన్నారు. స్థానిక వికలాంగుల కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో జరిగే కార్యక్రమాలపై పిల్లలతో చర్చించాలని, హోం, క్లాస్ వర్క్ పూర్తి చేయించాలని కోరారు. పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలన్నారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ అమలు చేయాలని, డిజిటల్ పాఠాల కోసం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు వినియోగించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే.సైదులు, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15న జిల్లా స్థాయి కామిక్ రచన పోటీలు..

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 15న జిల్లా స్థాయి 'కామిక్ రచన' పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, లోకల్ బాడీ, కేజీబీవీల్లో చదివే 6 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు ఉంటాయని, ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని వివరించారు. ఈ మేరకు విద్యార్థులను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వివరాలకు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్‌ను సంప్రదించాలని తెలిపారు.

అరకొర వసతులతోనే..

- జిల్లా పరిషత్‌కు ఏళ్లుగా పక్కా భవనం లేదు
- కొత్త మండలాలదీ అదే పరిస్థితి..
- కనీస సౌకర్యాలు లేక సిబ్బంది ఇక్కట్లు

చుంచుపల్లి : జిల్లా ప్రజా పరిషత్‌తో పాటు, పలు కొత్త మండల కార్యాలయాలకు సొంత భవనాలు లేక అరకొర వసతుల నడుమే పాలన సాగుతోంది. 2016 అక్టోబర్ 11న ఖమ్మం నుంచి విడిపోయి భద్రాద్రి జిల్లా కొత్తగా ఏర్పడింది. ఆ సమయంలోనే కొత్తగా మరో ఆరు మండలాలలకూ అవకాశం దక్కింది. దీంతో మొత్తం 21 మండలాలతో కలిసి జిల్లా పరిషత్ వ్యవస్థ రూపొందింది. 2019 జూలైలో తొలిసారి జిల్లా, మండల ప్రజా పరిషత్‌లకు ఎన్నికలు జరగగా ఆరేళ్లుగా జెడ్పీ కార్యాలయానికి సొంత భవనం లేదు. గతంలో ఉన్న కొత్తగూడెం మండల పరిషత్ భవనం నుంచే జెడ్పీ పాలన సాగిస్తున్నారు. ఇక్కడ సరైన గదులు, సమావేశ మందిరం అందుబాటులో లేక అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇటీవల జెడ్పీ కార్యాలయానికి పక్కా భవనం కోసం స్థలం గుర్తించి పక్కా భవన నిర్మాణానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నిధులు మంజూరుచేయలేదు. కొత్త పాలక వర్గాలు వచ్చేలోపైనా జెడ్పీ కార్యాలయానికి పక్కా భవనం అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

కొత్త మండలాలదీ అదే పరిస్థితి..

కొత్త జిల్లా ఏర్పాటు సమయంలోనే చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, కరకగూడెం మండలాలు సైతం ఏర్పాటయ్యాయి. ఈ మండల పరిషత్ కార్యాలయాలకూ పక్కా భవనాలు లేవు. గుండాల మండలం నుంచి 10 గ్రామ పంచాయతీలతో ఆళ్లపల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. మండల ఆవిర్భావ సమయంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయగా, అప్పటి నుంచి ఇరుకు గదులు, అరకొర సౌకర్యాల మధ్యే పాలన సాగుతోంది. చంద్రుగొండ మండలంలోని 10 గ్రామ పంచాయతీలను కలిపి అన్నపురెడ్డిపల్లి మండలాన్ని ఏర్పాటు చేయగా.. సాంఘిక సంక్షేమ భవనంలో అరకొర వసతుల నడుమ పాలన కొనసాగుతోంది. పినపాక నుంచి విడిపోయిన కరకగూడెం మండల పరిషత్‌ను గిరిజన సొసైటీ భవనంలో ఏర్పాటు చేయగా.. నేటికీ అక్కడి నుంచే అధికారులు పని చేస్తున్నారు. చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని పాత ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫీస్‌లో కొనసాగిస్తుండగా సిబ్బందికి సరైన గదులు, వసతులు లేక ఇబ్బంది తప్పడం లేదు. లక్ష్మీదేవిపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రభుత్వ పాఠశాల భవనంలో ఏర్పాటు చేయగా, ఇక్కడ కనీసం సమావేశాలకు హాలు కూడా లేకపోవడం గమనార్హం. సుజాతనగర్ మండల పరిషత్‌ను పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో ఏర్పాటు చేయగా, అక్కడా అరకొర సదుపాయాల నడుమే పాలన సాగుతోంది.



జెడ్పీ కార్యాలయానికి కేటాయించిన స్థలం ఇదే



పాత మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న జెడ్పీ

మరోసారి ప్రతిపాదనలు పంపుతాం



జెడ్పీ కార్యాలయానికి పక్కా భవనం కోసం పాత జిల్లా పరిషత్ పరిధిలోని స్థలాన్ని కేటాయించాం. నిర్మాణ పనులకు రూ.10 కోట్లతో గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు. మరోసారి ప్రతిపాదనలు పంపాలనుకుంటున్నాం. కొత్త మండలాల పరిధిలో పక్కా భవనాలకు స్థలాలను ఆయా మండలాల అధికారులు చూస్తున్నారు. – డి.నాగలక్ష్మి, జెడ్పీ సీఈఓ

జిల్లా జడ్జిని కలిసిన డీఎంహెచ్‌ఓ



జడ్జి పాటిల్ వసంత్‌కు మొక్క అందిస్తున్న జయలక్ష్మి

కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చేపడుతున్న చర్యల గురించి జడ్జికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధువరణ్, కిరణ్‌కుమార్, నరేష్, ఫయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే సమస్యల పరిష్కారం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కారేపల్లి: కమ్యూనిస్టులు అండగా నిలిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయనే విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కారేపల్లి మండలం మాధారంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికే పార్టీ ఆవిర్భవించిందని చెప్పారు. పదవులు ఉన్నా, లేకున్నా పేదవారి పక్షాన పోరాడేతత్వం కమ్యూనిస్టులకు ఉంటుందని తెలిపారు. కాగా, డిసెంబర్ 26న సీపీఐ వందేళ్ల వేడుకల ముగింపు సభ ఖమ్మంలో నిర్వహించనున్నామని వెల్లడించారు. కాగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్న విషయాన్ని అందరూ గుర్తించాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు భాగం హేమంతరావు, యర్ర బాబు, సీతామహాలక్ష్మి, రావి రామకృష్ణ, ఉంగరాల సుధాకర్, పాపినేని సత్యనారాయణ, బట్టు సంగయ్య, చెన్నంశెట్టి భూషయ్య, దళ్‌సింగ్, బట్టు సంగయ్య, బి.వీరునాయక్, కొల్లి వీరయ్య, రాయల రామారావు, పోతనబోయిన సహదేవ్, పి.రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన నాయకులు

క్లుప్తంగా

కళాశాలలో ఆకస్మిక తనిఖీ


అధ్యాపకులతో మాట్లాడుతున్న హేమచందర్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ డిప్యూటీ సెక్రటరీ హేమచందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. అడ్మిషన్లు పెరిగేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. డ్రాపవుట్లు లేకుండా చూడాలని, ప్రతీ ఒక్కరూ కాలేజీకి వచ్చేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. హాస్టల్ వసతి సమస్యను పరిష్కరించాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యాలయాల్లో ప్రవేశానికి స్పాట్ కౌన్సెలింగ్

భద్రాచలంటౌన్: ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హ్యూమాటిక్స్ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉండగా, గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2024–25లో ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 11న చర్లలోని ఏకలవ్య విద్యాలయంలో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు అన్ని ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్‌తో హాజరు కావాలని పీఓ సూచించారు.

ఆయిల్‌పామ్, పండ్ల సాగుపై దృష్టి సారించాలి


మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

పాల్వంచరూరల్: రైతులు సంప్రదాయ పంటలకు బదులు ఆయిల్‌పామ్, పండ్ల తోటల సాగుకు మొగ్గు చూపాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి సూచించారు. మండలంలోని కిన్నెరసాని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఆమె మొక్కలు నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా మొక్కలు అందించడమే కాక నిర్వహణ ఖర్చులు కూడా ఉపాధిహామీ పథకం ద్వారా లభిస్తున్నందున ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ చెన్నకేశవులు, ఏపీఓ పోరండ్ల రంగా, కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు కొత్వాల శ్రీనివాసరావు, బరపటి వాసుదేవరావు, కొండం వెంకన్న పాల్గొన్నారు.

బీటీపీఎస్‌ను సందర్శించిన జెన్‌కో డైరెక్టర్

మణుగూరు రూరల్: మండల పరిధిలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) వై. రాజశేఖర్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. రోజువారీ విద్యుత్ ఉత్పత్తి వివరాలను సీఈ బిచ్చన్నను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

బెంగాలీ కూలీ.. మాకూ కావాలి..

- అక్కడి కూలీలతో చకాచకా వరి నాట్లు
- పొలాల దగ్గరే గుడారాల్లో నివాసం
- పని పూర్తయ్యాక మరోచోటికి..
- అక్కడ పనిలేక ఇక్కడికి వలస
- పెరుగుతున్న డిమాండ్


లైన్ ప్రకారం వేసిన వరి నాట్లు


వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

పినపాక: పశ్చిమ బెంగాల్ నుంచి కొందరు కూలీలు వలస వచ్చి ఇక్కడ వరి నాట్లు వేస్తున్నారు. పొలాల దగ్గరే గుడారాలు వేసుకుని ఉంటూ.. ఇక్కడి కూలీలతో పోలిస్తే తక్కువ తీసుకుంటూ పని పూర్తి చేస్తున్నారు.

అయితే, వీరు నాట్లు వేసే విధానం ఎంతో మేలు చేకూర్చుతోందని రైతులు చెబుతున్నారు. వారంతా కుటుంబ సమేతంగా ఇక్కడకు వచ్చి వరి నాట్లు వేస్తుండటంతో రోజురోజుకూ వారికి డిమాండ్ పెరుగుతోంది. రైతులు బెంగాలీ కూలీలతో పనిచేయించుకునేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు.

ఉపయోగాలు ఇవీ..

విత్తనాలు తక్కువ పడతాయని, నారు వృథాగా పోదని, ఎకరాకు 15 కేజీల వడ్లు సరిపోతాయని, రెండు బస్తాల దిగుబడి ఎక్కువగా వస్తుందని, పద్ధతిగా లైను కట్టినట్లు వేస్తారని, కలుపు మందుల ఖర్చు తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

నాటు వేసే విధానం

బెంగాలీ కూలీలు నాటు వేసేటప్పుడు దారాలతో లైన్లు చూసుకుంటూ ఒక పద్ధతిలో వేయడంతో ఖర్చు తగ్గుతోంది. లైన్‌కు లైన్‌కు మధ్యలో గ్యాప్ చూసుకుంటూ నాట్లు వేయటం వల్ల వెలుతురు, గాలి సోకి పురుగు రాదు. దీంతో పురుగు మందులు ఒకటి – రెండు సార్లు పిచికారీ చేస్తే సరిపోతుంది. వారు ఎకరాకు రూ.3,000 నుంచి రూ.3,500 వరకు తీసుకుంటారు. రవాణా ఖర్చు ఉండకుండా పొలాల దగ్గరే గుడారాలు వేసుకొని ఉంటారు. ఇక్కడి కూలీలు రూ.5 వేల వరకు తీసుకోవడంతోపాటు రవాణా ఖర్చు కూడా ఉంటుంది. కానీ, బెంగాలీ కూలీలతో ఎకరాకు రూ.6 వేల వరకు కలిసి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తెలిపారు. ఏటా 80 నుంచి 100 మంది వచ్చి నాట్లు వేసి వెళ్తుంటారు.

ఖర్చు ఆదా అవుతోంది..



నేను గత ఏడాది ఐదు ఎకరాల్లో బెంగాలీ కూలీలతో వరి నాట్లు వేయించాను. కూలీల ఖర్చు మన కూలీల కంటే వెయ్యి నుంచి రూ.1500 వరకు తక్కువ. వరి నారు ఎకరాకు 15 కేజీలు సరిపోతుంది. కూలీలు పొలం దగ్గరే వండుకొని తిని నారు వేయటం వల్ల ఖర్చు ఆదా అవుతోంది.

–వెల్లంకి నర్సింహారావు, జానంపేట

అక్కడ పని లేకపోవడంతో వలస..



మేము పశ్చిమబెంగాల్ నోదియా జిల్లా నుంచి సుమారు 60 మంది వరి నాట్లు వేయటానికి పినపాక మండలానికి వచ్చాం. మా దగ్గర పని ఉండదు. ఉన్న పనికి సరిపడా కూలీ ఇవ్వరు. అందుకే పక్క రాష్ట్రాలకు వచ్చి పని చేసుకుని వెళ్తాం. జూన్ మొదటి వారంలో వరి నాట్లకు ఇక్కడికి వచ్చాం.

–భూపాల్ మండల్, కూలీ, పశ్చిమబెంగాల్

అన్ని జిల్లాల్లో వేస్తాం..



వరి నాట్లకు మేము ఎకరాకు రూ.3వేల వరకు తీసుకుంటాం. ఇద్దరు కలిసి ఒక ఎకరాకు నాటు వేస్తాం. జూన్ తొలి వారంలో వచ్చిన 12 మంది సభ్యులం 230 ఎకరాల వరకు నాట్లు వేశాం. పొలం దగ్గర వండుకొని తిని నాట్లు ప్రారంభిస్తాం. నిజాంబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కూడా వరినాట్లు వేస్తాం.

–చిత్తరంజన్ మండల్, కూలీ, పశ్చిమబెంగాల్

20 మందిపై కేసు


రెడ్డిగూడెం శివారులో ఆందోళన చేస్తున్న గిరిజనులు

పాల్వంచరూరల్: భూమిని అక్రమంగా చదును చేస్తున్న 20 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన గొల్లమారి రత్నారెడ్డికి మండలంలోని రెడ్డిగూడెంలో భూమి ఉంది. అందులోకి మంగళవారం వేపలగడ్డ గ్రామానికి చెందిన మోరే రవి, అశ్వాపురం మండలం వెంకటాపురంవాసులు కొందరు ప్రవేశించి భూమిని చదును చేస్తున్నారని భూ యజమాని ఫిర్యాదు చేశాడు. 20 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. కాగా, సాగులో ఉన్న ఆదివాసీలు, నిరుపేద రైతులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకోవడానికి నిరసనగా గిరిజనులు రెడ్డిగూడెం శివారులోని భూమి వద్ద, తర్వాత పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెట్టి బెదిరించడం తగదని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పున్నం చంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పది మందిపై కేసు

పాల్వంచరూరల్: భూ వివాదం కారణంగా జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేయగా పదిమందిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మండలంలోని నాగారంకాలనీకి చెందిన సపావత్ సరస్వతి తన భూమిలో అక్రమంగా ప్రవేశించారని భూక్యా భద్రుతో ఈనెల 5వ తేదీన వివాదం జరిగింది. మంగళవారం భూక్యా భద్రు, గుగులోతు రమేశ్, విజయ, జి.ధన్‌సింగ్, రాములు తనపై దాడి చేశారని సరస్వతి ఫిర్యాదు చేయగా ఐదుగురిపై కేసు నమోదు చేశారు. తమపై దాడి చేశారని విజయ ఫిర్యాదు చేయగా సరస్వతి, వెంకటేశ్వర్లు, మోతీలాల్, దగ్మా, సంధ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

మెడికల్ కిట్ల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

భద్రాచలంటౌన్ : ఐటీడీఏ పరిధిలోని 114 ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించేందుకు మెడికల్ కిట్ల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఐటీడీఏలోని అదనపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రూ. 2 వేల రుసుము చెల్లించి టెండర్ షెడ్యూల్ కాపీ పొందాలని సూచించారు. పూర్తి చేసిన టెండర్లను ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు కార్యాలయంలో అందజేయాలని, వివరాలకు 89788 81206 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

'విద్య ప్రాధాన్యతను మరిచిన ప్రభుత్వం'

ఖమ్మంమయూరిసెంటర్: సామాజిక, ఆర్థిక, అసమానతలు కలిగిన నేటి సమాజంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా ప్రాధాన్యతను గుర్తించడం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ విమర్శించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రభుత్వ విద్యారంగం విధ్వంసానికి గురైందని తెలంగాణ సమాజం రేవంత్‌రెడ్డిని గెలిపించిందని తెలిపారు. కానీ కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తుండడం ఆందోళనలకు గురి చేస్తుందన్నారు. ఎన్నికల సమయాన విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పినా ఆ పరిస్థితి లేదని ఆరోపించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఆవుల అశోక్, పీడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి మాట్లాడుతూ పాలకుల విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యార్థులు ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలనికోరారు. పీడీఎస్‌యూ జిల్లా కార్య దర్శి వెంకటేష్, నాయకులు శశి, కార్తీక్, యశ్వంత్, సందీప్, సాధిక్, సురేష్, పుదీల పద్వీ, నాసిర్, అశోక్ ,శ్రీను, పేర్ల వెంకటేష్, ప్రసాద్, పాషా, ప్రాణవ్, స్టాలిన్, నరేందర్, అనూష, అఖిల పాల్గొన్నారు.

కరకట్ట నిర్మాణం పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పీఓ

భద్రాచలంటౌన్: గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజల రవాణా మార్గానికి ఇబ్బందులు లేకుండా కొత్తగా చేపడుతున్న కరకట్ట నిర్మాణ పనులను ఇరిగేషన్ శాఖ అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కోరారు. సుభాష్‌నగర్, కూనవరం రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న కరకట్ట స్లూయిస్ పనులు, విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న స్లూయిస్‌లను పీఓ బి.రాహుల్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. గోదావరి వరద హెచ్చుతగ్గులతో ఉన్నందున ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండి, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాలు, అన్నదాన సత్రం, పట్టణంలోని డ్రెయినేజీలు నిండిపోయి వరద నీరు రోడ్డుపైకి రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచిచారు. విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఈసారి వరదలు వచ్చినప్పుడు ముంపు ప్రాంత, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీసీతారామ క్లబ్‌లో రూ.5 లక్షలతో నిర్మించిన టాయిలెట్ల సముదాయాన్ని ఎమ్మెల్యే, పీఓ ప్రారంభించారు.

పంట చేలల్లోకి వన్యప్రాణి సాంబారు

జనాల్ని చూసి బెదిరి ఫెన్సింగ్ తీగల్లో చిక్కుకుని మృత్యువాత


మృతి చెందిన వన్యప్రాణి సాంబారు


వన్యప్రాణిని పరిశీలిస్తున్న స్థానికులు

చండ్రుగొండ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడు శివారు కనకగిరి అటవీప్రాంతం నుంచి పంట చేలల్లోకి ఓ వన్యప్రాణి మంగళవారం వచ్చి మృత్యువాత పడింది. రైతుల కథనం ప్రకారం.. అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చి పరుగులు తీస్తున్న ఓ వన్యప్రాణిని కొందరు రైతులు గమనించారు. మనుషుల్ని చూసిన ఆ జీవి పొలం ఫెన్సింగ్‌లో చిక్కుకుంది. అప్పటికే గాయలపాలై అచేతనంగా ఉన్న ఆ ప్రాణి చూస్తుండగానే కుప్పకూలి తుదిశ్వాస విడిచింది. సమాచారం అందుకున్న బేస్‌క్యాంప్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని వన్యప్రాణి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేంజర్ ఎల్లయ్యను వివరణ కోరగా వన్యప్రాణి (సాంబారు) అడవి నుంచి బయటకు వచ్చి మృతి చెందిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. పోస్టుమార్టం అనంతరం ఆ ప్రాణిని ఖననం చేస్తామని తెలిపారు.

ఐదుగురిని వరించిన డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న రఘు

ఇల్లెందురూరల్: మండంలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురికి డాక్టరేట్ వచ్చింది. వరంగల్‌లో జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వీసీ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా ఒక ఉపాధ్యాయుడు, నలుగురు అధ్యాపకులు డాక్టరేట్ అందుకున్నారు. సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాల పీడీ కె.రఘు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకుడు ఎం.వెంకటేశ్వరరావు, రాజనీతిశాస్త్రం అధ్యాపకుడు ఎం.రాజు, తెలుగు అధ్యాపకుడు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, చరిత్ర అధ్యాపకుడు జి.శేఖర్ డాక్టరేట్ అందుకోగా ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, ఎంఈఓ ఉమాశంకర్ తదితరులు అభినందించారు.

హక్కుపత్రాలు లేవు.. సాగు చేయొద్దు


సుందర్‌లాల్ కుటుంబంతో మాట్లాడుతున్న సింగరేణి ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణి భూనిర్వాసితుడు, ఇల్లెందుకు చెందిన సుందర్‌లాల్‌లోధ్‌కు సింగరేణి సెక్యూరిటీ విభాగం అధికారుల నుంచి మరోమారు చుక్కెదురైంది. ఓసీ ఏర్పాటులో ఆయన 50 ఎకరాల మేర భూమి కోల్పోగా నెలల తరబడి నిరసనల అనంతరం గత ఏడాది ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యామ్నాయంగా భూమి చూపించారు. కారేపల్లి బైపాస్‌లోని సోలార్ ప్లాంట్ ఎదుట భూమిలో సాగుకు సిద్ధం కాగా మంగళవారం సెక్యూరిటీ విభాగం ఉద్యోగులు రాజేశ్, కామరాజు అడ్డుకున్నారు. హక్కు పత్రాలు లేనందున సాగు చేయడానికి అనుమతించబోమని తెలిపారు. దీంతో సుందర్‌లాల్ కుటుంబం మరోమారు ఎమ్మెల్యే కనకయ్యను ఆశ్రయించేందుకు సిద్ధమైంది.

ఆరుగురే విద్యార్థులు..


హాజరైన ఆరుగురు విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: కొత్త భవనం, విశాలమైన ఆవరణతో ఉండే ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరలేదు. అశ్వారావుపేట మండలం అల్లిగూడెంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉంది. నాలుగో తరగతి వరకు బోధన అందిస్తున్నారు. అయితే, ఒకటి, రెండో తరగతిలో ఇద్దరు చొప్పున ఉండగా.. మూడు, నాలుగో తరగతిలో ఒక్కొక్కరే ఉన్నారు. మొత్తం ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా.. ఒక్కడే ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు. ఆయన సెలవు పెడితే పాఠశాల మూతపడుతుంది.


జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

నీడ కోసం కాదు.. మొక్కల కోసమే.!

జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పచ్చని చెట్ల నీడలో బారులుదీరిన ఈ వాహనాలు నీడ కోసం అనుకుంటే పొరపాటే. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ దగ్గర్లో రహదారికి పక్కనే ఆయిల్ ఫెడ్‌కు చెందిన పామాయిల్ మొక్కల నర్సరీ ఉంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ నేపథ్యంలో ఆయిల్‌పాం తోటల సాగుకు అనుకూల వాతావరణం కావడంతో రైతులు పామాయిల్ మొక్కల కోసం నర్సరీ వద్దకు వస్తున్నారు. అక్కడ మొక్కలు తరలించేందుకు వాహనాలు అధిక సంఖ్యలో రాగా, వాటిలో కొన్ని వాహనాలు మంగళవారం తమవంతు కోసం రహదారిపై ఇలా బారులుదీరాయి.

– అశ్వారావుపేటరూరల్

కిన్నెరసాని జలాలు కలుషితం!

- కేటీపీఎస్ డ్రైయాష్‌ను బయటకు వదులుతున్న అధికారులు
- కిన్నెరసాని ఉప నదిలో కలుస్తున్న బూడిద
- పర్యావరణానికి, జీవరాశులకు తీరని ముప్పు


డ్రైయాష్‌ను పైపులైన్ నుంచి అలుగు నీటిలో వదులుతున్న దృశ్యం


బూడిద కలవడంతో కలుషితమైన నీరు

పాల్వంచ: పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ వల్ల నిత్యం వెదజల్లే జల, వాయు కాలుష్యంతో చుట్టు పక్కల ప్రాంతాలు కలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. ఈ ప్రాంతాన్ని ఒక రకంగా రెడ్ జోన్ పరిధిగా పరిగణిస్తున్నారు. అయితే, విద్యుత్ ఉత్పత్తి జరిగే క్రమంలో కర్మాగారం నుంచి వెలువడే వాయు కాలుష్యం ఒకవైపు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా మరో వైపు జల కాలుష్యం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే కాలుష్యం వల్ల గాల్లో అనేక కాలుష్య ఉద్గారాలు కలిసిపోతున్నాయి. దీంతో అనేక రకాల ప్రాణాంతక వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవలి కాలంలో యాష్ పాండ్‌కు వెళ్లాల్సిన డ్రై యాష్‌ను అధికారులు కిన్నెరసాని వాగులో కలిసేలా చేస్తూ జలకాలుష్యానికి తెరలేపడం తీవ్రంగా కలవరం రేపుతోంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా కిన్నెరసాని జలాలను కలుషితం చేస్తున్నా కాలుష్య నియంత్రణ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

అధిక మొత్తంలో బూడిద విడుదల

కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో 1000 మెగావాట్లు, 7వ దశ కర్మాగారంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ఇందుకు గాను సింగరేణి బొగ్గును మండించడం ద్వారా అధిక మొత్తంలో బూడిద వెలువడుతోంది. బాయిలర్‌లో బొగ్గు మండించడం ద్వారా ఫ్లైయాష్, డ్రైయాష్ వెలువడుతోంది. ఫ్లైయాష్‌ను సైలో ద్వారా యాష్ ట్యాంకర్లలో నింపి బయటకు పంపిస్తుంటారు. ఇక డ్రైయాష్‌ను యాష్ పాండ్ (బూడిద కట్ట)కు తరలించాల్సి ఉంటుంది. యాష్ పాండ్‌లో నిల్వ అయిన బూడిదను లారీల ద్వారా చిన్న తరహా పరిశ్రమలకు పంపిస్తుంటారు. కాగా 5, 6 దశల కర్మాగారంలో డ్రైయాష్‌ను పైపులైన్ల ద్వారా బూడిదకట్టకు తరలించాల్సి ఉండగా 'సీ' గేటు సమీపంలో పైపులైన్ వాల్వు ఓపెన్ చేసి తరచు బూడిద చెర్వు అలుగు నీళ్లలోకి వదులుతున్నారు. ఇలా బూడిద కలిసిన నీరంతా కిన్నెరసాని వాగులో కలుస్తోంది. అలా కలిసిన కిన్నెరసాని ఉప నది నీరంతా గోదావరిలోకి వెళ్తోంది. యాష్ పాండ్‌లు నిండకుండా ఇలాఅడపాదడపా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా బయటకు వదులుతుండటం వల్ల స్వచ్ఛ జలాలు కాస్తా కలుషితంగా మారిపోతున్నాయి.

ముప్పు ఎంతో..

ఈ అలుగు నీటిని చుట్టు పక్కల ఉండే రైతులు పంట భూములకు వాడుతుంటారు. వర్షాలకు అధిక మొత్తం వరద పోటెత్తితే పంట భూములు సైతం బూడిద నీటితో నిండిపోయి పంట సారం దెబ్బతింటుంది. బూడిద మేటలు వేయడం వల్ల పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కిన్నెరసాని జలాలు తాగడం వల్ల స్థానిక ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అంతేగాక పశువులు, జీవరాశులకు తీరని ముప్పు వాటిల్లుతోంది. ఇప్పటికే ఇక్కడి కాలుష్యం వల్ల అనేక మంది కేన్సర్, శ్వాస కోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతూ అనేక మంది మృతువ్యాత పడుతున్న పరిస్థితి ఉంది. ఈ క్రమంలో జల కాలుష్యానికి అధికారులు తెరలేపడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పలువురు వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టి సారించి విచారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావును వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, పరిశీలిస్తానని తెలిపారు.

రెండేళ్ల బాలుడికి పాముకాటు


సొమ్మసిల్లిన విక్రం ఆదిత్య

కరకగూడెం: ఓ మహిళ పొలం పనులకు వెళ్తూ తన రెండేళ్ల మనవడిని వెంటబెట్టుకెళ్లగా ఆ చిన్నారిని పాముకాటు వేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన ఊకే సారయ్య – నాగమణి దంపతుల కుమారుడు విక్రం ఆదిత్యను మంగళవారం ఉద యం ఆయన నాయనమ్మ పొలం పనులకు తీసుకెళ్లింది. సమీపాన బాబును పడుకోబెట్టి ఆమె పనుల్లో నిమగ్నం కాగా చిన్నారిని పాము కాటు వేయడంతో నురగలు కక్కుతూ స్పృహకోల్పోయాడు. దీంతో స్థానికుల సహకారంతో కారు లో పినపాక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యాధికారులు దుర్గా భవాని, కారం మధు చికిత్స చేశారు. ఆతర్వాత 108 వాహనంలో మణుగూరు ఆస్పత్రికి అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స చేస్తున్నారు. అయితే, బాలుడి పరిస్థితి ఇంకా ఆందోళనకరంగా ఉందని సమాచారం.

మద్యం మత్తులో పురుగులమందు తాగి వ్యక్తి మృతి

ములకలపల్లి: మద్యం మత్తులో పురుగులమందు సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం మేరకు.. మొగరాలగుప్ప గ్రామానికి చెందిన రాములమ్మకు, కొమ్ముగూడెంనకు చెందిన గడ్డం భద్రం (57)తో వివాహం కాగా.. ఇల్లరికం వచ్చి మొగరాలగుప్పలో ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భద్రం రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. పలుమార్లు కుటుంబీకులు మద్యపానం ఆపేయాలని కోరినా ఫలితం లేకపోయింది. ఈ నెల 5వ తేదీన అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన భద్రం .. భార్య రాములమ్మ అన్నం తెచ్చేలోగానే ఇంటి వెనుకకు వెళ్లి, పురుగులమందు డబ్బాను మద్యం బాటిల్‌గా భావించి సేవించాడు. కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.